క్లుప్తంగా

నేడు ఉర్దూ కవి సమ్మేళనం

కడప కల్చరల్ : ప్రముఖ ఉర్దూ కవి యూసఫ్ సఫీ జయంతిని పురస్కరించుకుని గురువారం కడప నగరంలో ఉర్దూ కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కార్యక్రమ కన్వీనర్ సత్తార్ ఫైజి తెలిపారు. బజ్మె జకి సంస్థ ఆధ్వర్యంలో నబీకోటలోని మదరసా–యే–ఫైజానె మహబూబె సుబానీలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. విశ్రాంత ఆచార్యులు డాక్టర్ సత్తార్ సాహిర్ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తారని, ప్రొఫెసర్ ఖాసిం అలీఖాన్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఉర్దూ కథకులు మహమ్మద్ షాహీద్, డాక్టర్ ఇక్బాల్ ఖుస్రో, మహబూబ్‌ఖాన్, డాక్టర్ వసీవుల్లా బక్తియార్ కూడా పాల్గొంటారన్నారు. పలువురు ఉర్దూ కవులు, రచయితలు, కళాకారులు, సాహిత్యాభిమానులు కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వినతి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని ఊటుకూరు రింగ్ రోడ్డు నుంచి జయరాజ్ గార్డెన్ మీదుగా చౌటపల్లి క్రాస్ వరకూ వీధి దీపాలు లేక చుట్టు పక్కల కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో ఎర్రగుంట్ల, బెంగళూరు నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. చిమ్మ చీకటిలో ఎక్కడైనా ప్రమాదం జరిగినా వాహనం గుర్తించేందుకు కూడా వీలుకాదు. పట్టణాభివృద్ధిలో భాగంగా భగత్ సింగ్ నగర్, హోంగార్డు కాలనీ, జయరాజ్ గార్డెన్, వికలాంగుల కాలనీ, జగనన్న కాలనీలు రింగురోడ్డు వెంట ఏర్పడ్డాయి. ఈ ప్రాంతంలో అక్కడక్కడైనా వీధి దీపాలు ఏర్పాటు చేస్తే ప్రజలకు రక్షణ, భద్రత ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

బీజేపీ ఎంపీని అరెస్ట్ చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజేష్ భూషన్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సత్తార్ పేర్కొన్నారు. బుధవారం ఇక్కడ ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతర్జాతీయంగా గర్వించే విధంగా అనేక పతకాలు సాధించిన మహిళా మల్లయోధులు తమను బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగికంగా వేధిస్తున్నాడని పోలీసు కేసు పెట్టినా ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రధాని మోదీ అండదండలతోనే బీజేపీ ఎంపీని అరెస్ట్ చేయలేదన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి అందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కదిరి ప్రసాద్, కృష్ణవేణి, సూరీడు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం ఇక్కడ విలేకరులతో ఆయన మాట్లాడుతూ నగరంలో దాదాపు 186 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని, కొన్ని సెంటర్లకు గ్యాస్ సిలిండర్లను ఇచ్చి మరికొన్నిటికి ఇంతవరకు ఇవ్వలేదన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు సొంత డబ్బుతో గ్యాస్ సిలిండర్లను అమర్చుకుంటున్నారని తెలిపారు. 2017 నుంచి రిటైర్ అయిన అంగన్వాడీ కార్యకర్తలకు ఇంతవరకు బెనిఫిట్స్ రాలేదని, పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగాశిక్షణా శిబిరం

కడప కల్చరల్ : నగరం పటేల్‌రోడ్డులోని మిత్ర యోగా సెంటర్‌లో 30 రోజుల యోగా శిక్షణా శిబిరాన్ని శుక్రవారం నుంచి ప్రారంభించనున్నామని సంస్థ నిర్వాహకులు, యోగా నిపుణులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, యోగా థెరపిస్టు డాక్టర్ కె.కల్పన తెలిపారు. ఉదయం 5.30 నుంచి 7.00 గంటల వరకు మొదటి బ్యాచ్, 9.00 నుంచి 10.30 గంటల వరకు మహిళలకు ప్రత్యేక బ్యాచ్‌గా శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 98488 61206, 7013238986 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పిరమిడ్ యోగా కేంద్రంలో

స్థానిక విశ్వాత్మ పిరమిడ్ యోగా కేంద్రంలో జూన్ 5వ తేదీ నుంచి యోగ, ధ్యాన శిక్షణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు డాక్టర్ ఊరి మ్మళాదేవి, ప్రొఫెసర్ జీవీఎస్ రెడ్డిలు తెలిపారు. నగరంలోని బుద్దటౌన్‌షిప్‌లో ప్రతిరోజు ఉదయం 5.30 నుంచి 6.30 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 80748 26819 నంబరులో సంప్రదించాలన్నారు.

కులాలను విమర్శించడం పార్టీలకు చేటు

కడప కల్చరల్ : పార్టీ నేతలుగా ఉండి కులాలను విమర్శించడం ఆ పార్టీకి చేటని గ్రేటర్ రాయలసీమ బలిజ సంఘం అధ్యక్షుడు చెన్నంశెట్టి మురళీకృష్ణ అన్నారు. బుధవారం కడప నగరంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. మాజీమంత్రి కొడాలినాని నిన్న కాపులను తీవ్రంగా దూషించడాన్ని తప్పుబట్టారు. ఒకరి నోటి దురుసు వల్ల ప్రజల అభిమానం పొందిన పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. భవిష్యత్తులో ఇలా కాపులను దూషించకుండా బలిజలు సమాఖ్యంగా నిలిచి ఇలాంటి వారి నోటి దురుసు తనాన్ని కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీపై అభిమానంతో కాపులు జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని గుర్తు చేశారు. జిల్లా బలిజ సంఘం కార్యదర్శి సగబాల రెడ్డెయ్య, ఉపాధ్యక్షులు ఉప్పు శ్రీనివాసులు పాల్గొన్నారు.

రంగురంగుల లోకం

- కనువిందు చేసే వర్ణ చిత్రాలు
- రంగుల ప్రపంచంలో చిన్నారులు



చిత్రాన్ని అభ్యసిస్తున్న బాలుడు



చిత్రాలు గీస్తున్న చిన్నారులు (ఇన్‌సెట్) గాజు గ్లాసులపై అందమైన పెయింటింగ్

కడప కల్చరల్ : బొమ్మలంటే ఎవరికైనా ఇష్టమే. కనువిందు చేసే రంగులు హృదయాన్ని హత్తుకుని ఎవరినైనా ఇట్టే ఆకర్శిస్తాయి. అందుకే మాటలు రాని వయస్సు నుంచి అక్షరాలు నేర్పడానికి ముందే పిల్లలు చిత్రలేఖనంపై మక్కువ చూపుతారు. తోచిన గీతలు గీసి అందులో చిత్రాలను వెతుక్కుని ఆనందిస్తారు. ఆ చిత్రాలే క్రమంగా అక్షరాలుగా మారుతాయి. వేసవి శిక్షణా శిబిరాల్లో పలువురు చిత్రకళను నేర్చుకుంటున్నారు.

ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో పిల్లలు ఎండలో తిరగడం, వృథాగా కాలం గడపడం ఇష్టంలోని తల్లిదండ్రులు లలిత కళలను నేర్పే ప్రత్యేక శిక్షణా శిబిరాలకు పిల్లలను పంపుతున్నారు. చిన్నారులంతా చిత్రకళను ఇష్టపడుతుండడంతో ఈ విభాగం కళకళలాడుతోంది. నగరానికి చెందిన పలువురు యువ, ప్రముఖ చిత్రకారులు వేసవి సెలవు ప్రారంభం నుంచి చిన్నారులకు చిత్రకళ నేర్పుతున్నారు. తెల్లని కాగితాలపై రంగులు అద్దుతూ మురిసిపోతున్న చిన్నారులు, తమ పిల్లలు గీసిన చిట్టిపొట్టి రంగుల చిత్రాలను చూసి పొంగిపోతున్న తల్లిదండ్రులు ఉండడంతో ఈ విభాగంలో చేరేందుకు పిల్లలు ఉత్సాహ పడుతున్నారు. సాధారణ పుస్తకాల కంటే రంగుల బొమ్మలున్న పుస్తకాలనే పిల్లలు ఎక్కువగా ఇష్టపడతారు. ప్రముఖ చిత్రకారులు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, మేరి, మనోహర్‌తోపాటు జిల్లా అంతటా 20 మందికి పైగా ఆర్ట్ మాస్టర్లు చిన్నారులకు వేసవి శిక్షణా శిబిరాలలో ఈ కళను నేర్పుతున్నారు.

చిన్నారుల శిక్షణలో భాగంగా పెన్సిల్, చార్‌కోల్‌లతో లైన్ డ్రాయింగ్, షేడింగ్, స్టంపింగ్ నేర్పుతున్నారు. ఇవిగాక మోడలింగ్ పద్ధతిలో చిత్రాలను గీయడం, గీసిన బొమ్మలకు రంగులు వేయడం నేర్పుతున్నారు. ముఖ్యంగా నీటి రంగులు (వాటర్ కలర్స్)తో చిత్రాలు నేరుగా గీయడంలో నైపుణ్యం సాధించేలా శిక్షణ ఇస్తుండడం విశేషం.

దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న మోదీ



మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేశ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం ప్రగతిపథంలో పయనిస్తోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భాను ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలన తీరుతో స్టార్టప్ కంపెనీలు దాదాపు 90 వేలకు పైగా వచ్చాయన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు మరోమారు బ్రహ్మరథం పట్టనున్నారని తెలిపారు. మద్యం అమ్మకాలపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో సీబీఐ తనదైన శైలిలో విచారణ జరుపుతుందే తప్ప అందులో విమర్శలకు తావు లేదన్నారు. ఇప్పటికే ఈ కేసులో అనేక మందిని అరెస్టుచేశారన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు యల్లారెడ్డి, కడప పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాలకృష్ణయాదవ్, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చలపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, బత్తల పవన్‌కుమార్, అమర్నాథరెడ్డి, కల్యాణ్, లక్ష్మణరావు, శివ, కృష్ణ, శాలివాహన్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు విత్తనాన్ని అందిస్తాం



వేరుశనగ విత్తనాన్ని అందజేస్తున్న రఘునాథరెడ్డి

వీరపునాయునిపల్లె : వేరుశనగ పంట సాగు చేసే ప్రతి రైతుకు విత్తనాన్ని అందిస్తామని మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి తెలిపారు. మండలంలోని మొయిళ్లచెరువు రైతు భరోసా కేంద్రంలో బుధవారం మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో రైతులపట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో వారికి అవసరమైన అన్నింటిని అందిస్తోందన్నారు. కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ మొయిళ్లచెరువు రైతుభరోసా కేంద్రానికి ఇప్పటి వరకు 40 క్వింటాళ్లు మంజూరయ్యాయని వాటిని రైతులకు అందజేశామన్నారు. మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు మాట్లాడుతూ 40 శాతం రాయితీతో విత్తనాన్ని అందిస్తున్నామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతుభరోసా సిబ్బంది, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సంబరాల్లో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

కమలాపురం : ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను సైతం అమలు చేసి దేశం చూపునంతా ఏపీ వైపు మరల్చిన సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన నాలుగేళ్ల పేర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించినట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎన్‌సీ పుల్లారెడ్డి తెలిపారు. మండల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న సంబరాల్లో భాగంగా బుధవారం 4వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ నిఖిల్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి గ్రామచావడి వరకు అలాగే అక్కడి నుంచి క్రాస్ రోడ్డు వరకు, తిరిగి పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అవినీతిలో నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి రహిత పాలన అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలుపుతున్నారన్నారు. అధికారంలోకి రాగానే నవరత్నాలను ఒక భగవద్గీతగా, ఖురాన్‌గా, బైబిల్‌గా భావించి సంక్షేమ క్యాలెండర్ ప్రకటించారన్నారు. ప్రకటించిన తేదీ కంటే ఒక రోజు ముందే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ వైఎస్ జగన్‌ను మరో సారి ఆశీర్వదించాలన్నారు. ప్రతి కుటుంబం వైఎస్ జగన్‌ను తమ కుటుంబ సభ్యుడిగా భావించడం వల్లనే 151 సీట్లతో సీఎం అయ్యారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆర్‌వీఎస్ఆర్, మహ్మద్ సాదిక్, కొండారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, ఇర్ఫాన్, పి.సుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, మస్తానయ్య, ఖాజా హుసేన్, గౌస్ మోహీన్, విజయేంద్రారెడ్డి, సుబ్బన్న, మోనార్క్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట వేడుకలు



ప్రత్యేక అలంకరణలో సీతారాముల ఉత్సవ మూర్తులు

వేముల : మండలంలోని చాగలేరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ట వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, మహా పూర్ణాహుతి, కుంభ యాత్ర దానం, కళావాహన హారతి నిర్వహించారు. అనంతరం సీతారామ,లక్ష్మణ, హనుమాన్‌విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురోహితులు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం సీతారాముల ఉత్సవమూర్తుల గ్రామోత్సవం నిర్వహించారు.

ఘనంగా బండలాగుడు పోటీలు

శ్రీసీతారాముల విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని బండలాగుడు పోటీలను నిర్వహించారు. పెర్నపాడుకు చెందిన రామాంజనేయులు ఎద్దులు ప్రథమ స్థానం రూ.35వేలు, ముదిగుబ్బకు చెందిన కోట్ల రమణ ఎద్దులు రెండవ స్థానం రూ.30వేలు, వేంపల్లెకు చెందిన వి.రమణయ్య ఎద్దులు మూడవ స్థానం రూ.25వేలు, బ్రాహ్మణపల్లెకు చెందిన చిన్నపుల్లారెడ్డి ఎద్దులు నాల్గవ స్థానం రూ.20వేలు, కడేకళ్ల గ్రామానికి చెందిన భీమశేఖరయాదవ్ ఎద్దులు 5వ స్థానంలో నిలిచాయి. బహుమతులను మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ బయపురెడ్డిలు అందించారు.

ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు గుర్తింపు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికుల కోసం స్థాపించిన వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు లభించిందని అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబా ఫకృద్దీన్ తెలిపారు. తక్కువ సమయంలో 52 వేల మంది కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కార్మిక కుటుంబాలు రుణపడి ఉంటాయన్నారు. గుర్తింపు కోసం కృషి చేసిన అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు చంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి డీఎస్‌పీ రావులకు కార్మికుల పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

వైఎస్సార్ ఏఎఫ్‌యూ స్థలంలో సర్వే

కడప ఎడ్యుకేషన్: డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వ విద్యాలయానికి కేటాయించిన 110 ఎకరాల్లో బుధవారం రెవెన్యూ అధికారులు సర్వేచేశారు. యోగివేమన విశ్వ విద్యాలయానికి సమీపంలో కేటాయించిన స్థలంలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా పెండ్లిమర్రి రెవెన్యూ అధికారులు స్థలాన్ని సర్వే చేసి హద్దులను చూపించడంతో విశ్వవిద్యాలయ సిబ్బంది జెండాలను పాతారు.

పొగాకుతో క్యాన్సర్ వచ్చే అవకాశం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కమలాపురం : పొగాకు నమలడం, ధూమపానం చేయడం వలన క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అశోక్ కుమార్, అయ్యవారు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలను గౌరవించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : పాలకులు భక్తుల మనోభావాలను గుర్తించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ తెలిపారు. బుధవారం కడపలోని మాసాపేట ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయాన్ని అక్రమంగా కూలి ్చేసి షాపింగ్ కాంప్లెక్స్ కట్టాలని భావించడం తగదన్నారు. ఈ విషయంగా భక్తుల మనోభావాలను గౌరవిస్తూ నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, కల్యాణ్, జోనల్ ఇన్‌చార్జి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కడప పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ బాలకృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు రాయితీ

చెన్నూరు : పాడి రైతులను ఆదుకునేందుకు విజయ మిల్క్ డైరీ ముందుకు వస్తోంది. మండలంలోని రామనపల్లి గ్రామంలో విజయ డైరీ మిల్క్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కా ర్యక్రమాన్ని నిర్వహించారు. ఎవరైనా కొత్తగా పశువులను కొనుగోలు చేసి డైరీకి పాలు పోస్తున్నారో అలాంటి వారికి పశువు కొనుగోలుపై 20 శాతం రాయితీని అందించేందుకు విజయ డైరీ మిల్క్ సిద్ధంగా ఉన్నట్లు విజయ డైరీ మిల్క్ మేనేజర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. రా మనపల్లె గ్రామానికి సంబంధించి రూ. లక్ష 18 వేలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. విజయ మిల్క్ డైరీ మేనేజర్ రామనపల్లె గ్రామానికి విచ్చేసి గ్రామంలోని విజయ డైరీ ఏజెంట్ సునీల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పదిమంది రైతులకు పది చెక్కులను అందించారు. రైతులు మేనేజర్ వెంకట్రామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాల అందజేత



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో అతిథులు

కడప కల్చరల్ : స్థానిక అక్కాయపల్లెలోని మహమ్మదీయ సిద్దిఖ్ మసీదు కమిటీ ఆధ్వర్యంలో నెల రోజులపాటు విద్యార్థులకు నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణా శిబిరం విజయవంతమైందని నిర్వాహకులు తెలిపారు. బుధవారం సంస్థ కార్యాలయంలో ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఇస్లామిక్ ప్రీ సమ్మర్ శిబిరంలో 150 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు విశ్రాంత ఆచార్యులు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధార్మిక విద్య, మతంపై అవగాహన, మానవతా విలువలు, ఉత్తమ పౌరుల లక్షణం తదితర అంశాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రముఖ ఉర్దూ కవి సత్తార్‌ఫైజి మాట్లాడుతూ బాల్యం నుంచి నీతి, నిజాయితీ, సభ్యత, సంస్కారం, మానవతా విలువలు నేర్పాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా జరిగిన చిత్రలేఖనం, తదితర పోటీల్లో ప్రతిభ చూపిన చిన్నారులకు అతిథులు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, పతకాలను బహూకరించారు. కార్యక్రమంలో నగర ముస్లిం ప్రముఖులు ఇస్తాక్‌బాషా, డాక్టర్ హిదాయతుల్లా, తాహీర్, తారీఖ్, మత గురువు అమీర్‌బాషా, జబీవుల్లా, జలీల్, కార్యక్రమ నిర్వాహకులు మగ్బూల్ అహ్మద్, మసీదు కమిటీ కార్యదర్శి సుబాన్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ అల్మాస్‌పేటలోని మదరసా సిరాజుల్ ఉలూమ్‌లో విద్యార్థుల ఇస్లామిక్ వేసవి శిక్షణా శిబిరం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు శిక్షణలో నేర్చుకున్న అంశాలలో నిర్వాహకులు పోటీలు నిర్వహించారు. మదరసా నిర్వాహకులు ముఫ్తీ సయ్యద్‌షా బక్తియారుద్దీన్ ఖాద్రి సాహెబ్, ఇతర అతిథులు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. స్థానిక ప్రముఖుల షేక్ నిజాం, అమీన్ పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు ఆందోళనలు



కలెక్టరేట్ వద్ద దీక్షలు చేపట్టిన ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగులు

కడప సెవెన్‌రోడ్స్ : న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకపోతే దశల వారీ ఆందోళనలు చేపడతామని ప్రభుత్వ ఉద్యోగులు తెలిపారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణప్రసాద్, నాగరాజు ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌కుమార్, సుదర్శన్‌రెడ్డిలు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. ప్రతినెల 1వ తేదీ జీత భత్యాలు చెల్లించేలా చట్టం తీసుకు రావాలన్నారు. 1993 నవంబరు 25వ తేదీకి ముందు నియమితులైన ఎన్ఎంఆర్, డైలీ వేజెస్, కంటింజెంట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. 11వ పీఆర్సీ అములులో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల్లో భాగంగా ఆర్థికపరమైన బకాయిలను, డీఏ, అరియర్స్‌ను తక్షణమే చెల్లించాలన్నారు. 12వ వేతన సవరణ సంఘం నియమించకుండానే ఉద్యోగ సంఘాలతో సంప్రదింపులు జరిపి వేతన సవరణ చేపట్టాలన్నారు.

ధూమపానం మానండి.. ఆరోగ్యం కాపాడుకోండి

చాపాడు : ధూమపానం చేయకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి పేర్కొన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చాపాడులోని వీధుల్లో పొగాకు వాడకం పట్ల ఆరోగ్యానికి కలిగే ఇబ్బందులపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. సొలనేసి కుటుంబానికి చెందిన ఒక చిన్న మొక్క నుంచి పొగ విడుదల అవుతుందని దీంతో దీనికి పొగాకు అని పేరొచ్చిందన్నారు. దీని ఆకుల నుంచి సిగరెట్లు, చుట్టలు, తాంబూళాలు తయారు చేస్తారన్నారు. పొగ తాగటం, పొగాకు చెక్క తినడం వలన లివర్, గుండె, ఊపిరితిత్తులు చెడిపోయి క్యాన్సర్, టీబీ వంటి వ్యాధులు వస్తాయన్నారు. వైద్యులు కావ్య మాధురి, ఓబులేసు, సీహెచ్ఓ రాముడు, సూపర్‌వైజర్ సరస్వతి, ఎఫ్‌పీసీ పర్యవేక్షకులు నారాయణరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఆరోగ్యాన్ని దహిస్తుంది

ప్రొద్దుటూరు క్రైం : పొగాకు ఆరోగ్యాన్ని పూర్తిగా దహించి వేస్తుందని కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి తెలిపారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ మాట్లాడుతూ సరదాగా మొదలైన బీడి, సిగరేట్ వాడకం తర్వాత దురలవాట్లుగా మారుతాయన్నారు. పొగాకు విష కోరల నుంచి దేశప్రజలను విముక్తి చేసేందుకు జాతీయ స్థాయిలో సమగ్ర ప్రణాళికను రూపొందించాలన్నారు. పొగాకు ఉత్పత్తులను, వాటి అమ్మకాలను పూర్తిగా నిషేధించాలని తెలిపారు.

మార్కెట్‌యార్డును అభివృద్ధి చేస్తాం



గుర్తింపుకార్డులతో మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్, డైరెక్టర్లు, సెక్రటరీ తదితరులు

కడప అగ్రికల్చర్: కడప మార్కెట్‌యార్డును త్వరలో అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని కడప మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ బంగారు గంగాదేవి పేర్కొన్నారు. బుధవారం కడపలో యార్డు కార్యదర్శి బాల వెంకటరెడ్డి, బంగారు గంగాదేవి డైరెక్టర్లకు గుర్తింపు కార్డులను అందచేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మార్కెట్‌యార్డు అభివృద్ధికి కావాల్సిన నిధుల విషయాన్ని మార్కెటింగ్‌శాఖ మంత్రికి తెలియజేశామన్నారు. త్వరలో నిధులు మంజూరు కావచ్చని, నిధులు రాగానే వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. రైతులకు హమాలీలు, డైరెక్టర్లు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్లు బంగారు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ మీడియంలో ప్లస్‌టు కళాశాలలు ఏర్పాటు చేయాలి



డిప్యూటీ సీఎంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న రూట నాయకులు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా ఉర్దూ మీడియం పాఠశాలల్లో ప్లస్ టు కళాశాలల ఏర్పాటు చేసి ఉర్దూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్(రూట) వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ హిదయతుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ అన్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన 292 ఇంగ్లీషుమీడియం ప్లస్ టు కళాశాలల్లో మైనార్టీ విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉర్దూ పీజీటీ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. ఈ విషయమై బుధవారం డిప్యూటీ సీఎంను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు కార్యక్రమంలో రూట రాష్ట్ర సమన్వయకర్త ముహమ్మద్ అయ్యూబ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు షాహీదుల్లా, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి అసిదుల్లాబాషా, డైరీ కమిటీ చైర్మన్ హాజీ అబ్దుల్ హకీమ్, కో చైర్మన్ సయ్యద్ సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నచౌక్ ఎస్ఐగా రవికుమార్ బాధ్యతలు



కడప అర్బన్: నగరంలోని చిన్నచౌక్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా పి.రవికుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. 2012 బ్యాచ్‌కు చెందిన ఈయన కొండాపురం, పులివెందుల, చెన్నూరు, కడప విజిలెన్స్, కడప సైబర్ క్రైమ్ విభాగాల్లో ఎస్ఐగా విధులను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ



ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

రాయచోటి టౌన్ : ఎరువులు, విత్తన షాపులను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. బుధవారం రాయచోటి పట్టణ పరిధిలోని పలు ఎరువుల దుఖాణాలను ఉమ్మడి కడప జిల్లా రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్‌మెంట్ అధికారి మసూద్ బాషా తనిఖీలో పాల్గొన్నారు. బస్టాండ్ సమీపంలోని విశ్వప్రసాద్‌రెడ్డి ఫర్టిలైజర్, రఘు అగ్రి కేర్‌లలో ఏక కాలంలో తనిఖీ చేశారు. రఘు అగ్రికేర్‌లో రికార్డులలో సరిగా నమోదు చేయని కారణంతో 43 క్వింటాళ్ల (రూ. 1,41,900లు) విత్తన వడ్లను అమ్మకాలను నిలుపుదల చేస్తూ స్థానిక ఏఓ దివాకర్ చేశారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు వీటి అమ్మకాలు నిలుపుతున్నట్లు తెలిపారు. దాడులలో కడప రీజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయానికి చెందిన సీఐ రామకృష్ణ, ఏజీ మైన్స్ జి. శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగ తగిలి గేదె మృతి

జమ్మలమడుగు రూరల్ : మైలవ రం మండలం వద్దిరాలకు చెందిన కొర్నేపల్లె సుబ్రమణ్యంకు చెందిన పశువులు మంగళవారం మేత మేసేందుకు కొండకువెళ్లాయి. వాటిల్లో ఓ గేదె పొలంవద్ద విద్యుత్ తీగ తగిలి మృతి చెందింది. దాదాపు రూ.40 వేలు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.